"ఏమిటి నవ్వుతున్నావు." ఈ లోకమే మర్చిపోయినట్టు నిలబడిన జయంతి ఫులిక్కి-పడి వెనక్కు తిరిగింది. వెనకగా దగ్గరగా శేఖరం కళ్ళదించి జయంతివేపే చూస్తున్నాడు. అతని కళ్ళల్లోకి కొత్తకాంతి వచ్చింది. ఆ కొత్తకాంతితో మెరుస్తున్న కళ్ళు జయంతి విగ్రహంలోని ప్రతి వంపుని నిస్సంకోచంగా స్పష్టంగా పరిశీలిస్తున్నాయి. అతని చూపులతో చూపులు కలవగానే కంగారుపడిన జయంతి కళ్ళు దించేసుకుని "యేమీలేదు" అంటూ వెనక్కు తిరిగివచ్చి కుర్చీలో పొందిగ్గా కూర్చుంది.

జయంతివెంటే శేఖరం వెనక్కు తిరిగి రాలేదు. చాలాసేపు అలాగే అక్కడే నిలబడిపోయి జయంతివైపు వీపుపెట్టిపాంట్ జేబుల్లో చేతులు పెట్టుకుని క్రిందకుచూస్తూ నిలబడిపోయాడు. ఆ తర్వాతగూడా అతనెక్కువగా మాట్లాడలేదు. హఠాత్తుగా అతనెందుకు మౌనంగా, గంభీరంగా మారిపోయాడో జయంతి కర్థంగాలేదు. కంటికి ఆహ్లాదంగా, మనసుకి అద్భుతంగావున్న ఆ వాతావరణంలో ఇంటికివెళ్ళటం ఆలస్యం అయినాసరే యింకొంచెంసేపు కూర్చోవాలనిపించింది. కానీ పొద్దుపోతోంది, త్వరగా రమ్మనమని శేఖరం తొందరచేశాడు. పైకి వెళ్ళేటప్పుడు కావాలని మెట్లమీదనుంచి తీసుకెళ్ళిన శేఖరం క్రిందకు దిగివచ్చేటప్పుడు ఆలస్యం భరించలేనట్టు లిఫ్టులో వెళ్ళిపోదాం అన్నాడు. జయంతి నిశ్శబ్దంగా వుండిపోయింది.

ఇంటిదగ్గరకి తీసుకొచ్చి దింపెయ్యగానే కారులోంచి దిగుతూ "థ్యాంక్స్" అంది జయంతి.

"ఎందుకు ?" అన్నాడు శేఖరం పరధ్యానంగా.

జయంతికేం చెప్పాలో తోచలేదు. బొమ్మలా అతనివైపు చూస్తూ నిలబడిపోయింది.

కారు స్టార్ట్ చెయ్యబోతున్న అతను హఠాత్తుగా ఆగి "ఒకమాట చెప్పటం మర్చిపోయాను, నువ్వు నాకంటే చాలా చిన్నదానివి. నిన్ను కావాలని మర్యాదకోసం మీరు అనాలని అన్పించినా మధ్యమధ్యలో మర్చిపోతున్నాను. దానికేం అనుకోవుగదూ" అన్నాడు.

"నేనేమనుకోను థ్యాంక్స్" అంది.

"వస్తా. గుడ్ నైట్." జయంతిచూస్తుండగానే కారు వెళ్ళిపోయింది. జయంతికి ఇంటికి వచ్చి పడుకున్న తర్వాత అంతా బాగానేవున్నట్టు అన్పించినా మళ్ళీ ఎక్కడో అసంతృప్తిగా అన్పించసాగింది. సినిమాలో అంత ఆప్యాయంగా, సునందంతగాదగ్గరగా మాట్లాడిన శేఖరం హఠాత్తుగా అలా ఎందుకయాడు ! ముఖ్యంగా హోటల్ లో రూఫ్‌గార్డెన్ మీద తనవైపు వీపుపెట్టి అసలు జయంతి అనే ఉనికినిగూడా మర్చిపోయి అంత నిశ్శబ్దంగా నిలబడిపోయాడెందుకు ! జయంతికి హఠాత్తుగా గుర్తువచ్చింది. రేఖారాణి కన్పించిన తర్వాతనే అతనిలో ఆ మార్పు వచ్చిందని.

(సశేషం)

---

ఒక తాగుబోతు : "టైమెంతయిందో చెప్పగలరా ?"

రెం. తా. : "చెప్పగలను"

మొ. తా. : "థాంక్స్."





# అందాలూ అసూయలూ

*

## 'అరవింద'

డ్రెస్సింగ్ టేబిల్ దగ్గర నిలబడి జడఅల్లుకుంటోంది విజయ. ప్రసాద్ ఎలక్ట్రిక్ షేవర్‌తో గడ్డం చేసుకుంటున్నాడు. శ్రీమతి మిశ్రా మెట్లెక్కివస్తూండటం అతడికి కిటికీలోనుంచి కనపడింది. విజయవైపు తిరిగి "ఆవిడ వస్తోంది" అన్నాడు. తలయెత్తకుండానే వేసుకున్న రెండు జడలనీ సర్దుకుంటూ

"ఆవిడంటే ఎవరు ?" అంది విజయ.

"ఆవిడ, మిశ్రాభార్య" అన్నాడు ప్రసాద్ భార్యముఖంలోకి చూస్తూ.

ముఖం చిట్లించుకుంది విజయ.

"ఆవిడవస్తే ఇతడి కెందుకో అంత గాబరా. ఆవిడేమన్నా, మహారాణీనా, మినిష్టరా ?" అనుకుంటుంటే ఆవిడ లోపలికి వచ్చింది.

విజయ కొంచెం నవ్వుతెచ్చుకుని కూర్చోమని కుర్చీ చూపించింది.

ఆవిడ వస్తే కూర్చోదు. గదిలో తిరుగుతూ అన్ని సామాన్లూ చూస్తూఉంటుంది.

"ఈ దుప్పటి చాలా బాగుంది. ప్రసాద్ కొన్నాడా. మీ ఆయనకి మంచి టేస్టుఉంది." అంటుంది. తన యెదుట అతను ఉండగానే పొగుడుతుంది. తనకి గర్వపడాలో ఆవిడ

గడుసుతనాన్ని మెచ్చుకోవాలో అర్థంకాదు. ప్రసాద్ మాత్రం చిరునవ్వులు ఒలక బోస్తాడు.

"నీకు తెలియదు కానీ విజయా, శ్రీమతి మిశ్రా ఇల్లు ఎంత చక్కగా పెడు తుందని, వంటలు ఎంతరుచిగా చేస్తుందని!" అని అతడు బదులు మెచ్చుకుంటాడు. తనకి తెలియదు.

నిజమే ఆవిడ తనని రమ్మనదు. తను వెళ్ళదు. ఆవిడ చేస్తు ప్రసాద్ కొక్కడికే తెలుసు. తనకు తెలియదు. "అసలు ఈవిడ నాకు స్నేహితురాలేమిటీ అతడి స్నేహితు రాలు" అనుకుంటుంది విజయ.

"ఎందుకట్లా ఇల్లంతా తిరుగుతుంది. ఒకచోట కూర్చోక ?" అని తెలుగులో వినుగ్గా అడుగుతుంది విజయ ప్రసాద్‌ని.

"ఏం తప్పా ?" అని అడుగుతాడు ప్రసాద్.

"తప్పయితేనే మనం చెయ్యమా ? తప్పులు మనం చెయ్యకుండా ఉన్నామా ?" అనుకుని ఒళ్ళు మండుతుంది విజయకి.

"మీరు వాళ్ళింటికి వెళ్ళి. అట్లాగే తిరుగు తారుకాబోలు. అందుకే ఈవిడా ఇట్లాగ తిరుగుతుంది. కొత్త, పాతలేదు. అటువంటి చనువంటే నా కసహ్యం" అంటుంది.

"నీకు సరదాగా ఉండటం. సిటీలైఫ్ అంటే ఏమిటో తెలుస్తేకదూ" అంటాడు.

మనసులో ముప్పిరిగొనే ఆలోచనలు, కోపం, అసహ్యం విజయని ఇంక మాట్లాడ కుండా చేస్తాయి.

అతడి కది అర్థంకాని విషయం. అతడితో వాదించి లాభంలేదు. తనలో మాత్రం క్రోధం. అసహ్యం రోజురోజుకీ పెరిగిపోతున్నాయి.



ఆవిడ ప్రసాద్‌తో మాట్లాడుతోంది. పంచదార తను ఒక మణుగు నిలవచేసిం దిట. తన టీకి. స్వీట్స్‌కి ఏమీ ఇబ్బంది లేదుట. ప్రసాద్ అంటున్నాడు "మాకు కూడా దొరికేట్లు చూడమని" ఆవిడగర్వం. ఇతడి యాచన చూస్తుంటే మనసులో రగులుకుంటున్న అగ్ని మండటానికి సిద్ధ పడుతోంది విజయలో.

ఆ సమయంలో ప్రసాద్ భార్యవైపు తిరిగి "కాస్త కాఫీ చెయ్యి" అన్నాడు.

"ఇప్పుడే కదా తాగాము. మళ్ళీ నేను చెయ్యలేను" అంది విజయ.

"ఆవిడకోసం" అన్నాడతడు.

"ఆవిడకోసం, ఇప్పుడు చెయ్యనవసరం లేదు" అంది మళ్ళీ.

"ప్లీజ్" అన్నాడతడు.

"కావలిస్తే మీరు చెయ్యండి. ఇద్దరూ తాగండి."

అని వరండాలో వాష్ బేసిన్‌లో చెయ్యి కడుక్కుంటోంది. టవల్ భుజంమీద వేసు కుని ముఖంకడుక్కోటానికి విజయ వెన కాల అతడూ వెళ్ళాడు. ఆవిడకూడా వచ్చి గుమ్మంలో నుంచుంది.

"నీ కెందుకంత :జెలసీ . " తెలుగులో సంభాషణ సాగుతోంది.

"ఆవిడకి మీదగ్గరనుంచి ఏం కావాలి ? మీకు ఆవిడ దగ్గరనుంచి ఏం కావాలి ? ఊరికే అట్లా ఒకరిచుట్టూ ఒకరెందుకు తిరుగుతుంటారు."

"పాపం, ఆవిడ సరదాగా ఉంటుంది అంతే. దానికి నువ్వు అనవసరంగా కోపం తెచ్చుకుంటున్నావు. అంతే. ఏమీలేదు."





"ఇంతకంటే ఏమైనా వుంటే నయం. అర్థంకోసం తలవగలకొట్టుకోనవసరంలేదు. ఏమీ లేకపోతే యెందుకా తినేసేటట్లు చూడటం ! తెల్లగా ఉంటుంది. స్లీవ్‌లెస్ వేసుకుంటుంది. ఇంక ఆ భుజాలనుంచి చూపులుతిప్పుకోలేరు. ఇంకా ఏమీ ఉండాలి. ఊసిగులేనితనం చాలదూ....ఛీ...."

చర చర మెట్లు దిగి వెళ్ళిపోయింది విజయ. గ్రౌండ్ ఫ్లోర్‌లో కూడా తెలుగు వాళ్ళే ఉంటున్నారు.

ఆవిడను పిన్నీ అంటుంది విజయ. వెళ్ళి ఒక కుర్చీలో కూర్చుంది విజయ.

"మిశ్రా పెళ్ళాం వచ్చినట్లుంది" అంది సావిత్రి-పిన్నిగారి పెద్దకూతురు.

"ఆ వచ్చింది" అంది విజయ.

"కొంతమంది మనుష్యుల్ని సహించటం చాలా కష్టం. ఈ మిశ్రాఉందే...." అని సావిత్రి అంటుంటే మెట్లమీద ప్రసాద్ దిగివస్తూ కనిపించాడు. అతడి వెనకాలే ఆవిడ వస్తోంది.

"ఆవిడ దేం తప్పులేదు. ఎవరిని ఎంత దూరంలో ఉంచాలో, మర్యాదలకి, స్నేహాలకి హద్దులెక్కడో తెలియకపోవటంలోనే ఉంది చేతకానితనం. అయినా ఏమనిషిని ఎట్లాచూడాలో తెలియని మనిషికి ఎన్ని చెప్పి ఏం లాభం. బాధపడి ఏమి ప్రయోజనం." అంది విజయ గట్టిగా.

"మా ఆవిడకి తలనొప్పిగా ఉందిట. మందు తెప్పించుకోటానికి క్రిందికిదిగింది" అని చెప్తున్నాడు ప్రసాద్. శ్రీమతి మిశ్రాతో.

విజయ అతనికేసి కోపంగాచూసి .

"తలనొప్పికాదు. వొళ్ళుమంట" అంది గట్టిగా.

"అట్లావచ్చేశావు. ఆవిడ ఏమనుకుంటుంది!" అన్నాడు ప్రసాద్.

"ఆవిడ ఏమీ అనుకునే మనిషి కాదు. మీరు స షిస్తారు. కొంచెం సేపు ఏకాంతంగా ఆవిడ అందం కన్నులతో త్రాగి ఆనందిస్తారు."

"నువ్వేమి మ ట్లాడుతున్నావో...."

"దయచేసి నాకు చెప్పనవసరంలేదు. అవును. ఒకళ్ళు వింటారని అభిమానపడే పరిస్థితి నన్నుదాటిపోయింది. రోడ్డునపోయే ప్రతి ఆడదాన్ని విలాసంగా చూడటం తప్పితే భార్య అనేది ఒకత్తె ఉంటుందని, దాని అభిమానించాలని ఎప్పుడైనా ఆలోచించారా అసలు! ఒకడికి పెళ్ళాం అవడం కంటే—పెళ్లాంకూడా నలుగురితోబాటు ఒక ఆడది—అన్నీ అమర్చిపెట్టవలసిన జీవితాంత సేవకురాలు—అంతే. ఛీ"

విజయ లేచి దూకుడుగా మేడమీదికి వెళ్ళిపోయింది మళ్ళీ.


శ్రీమతి మిశ్రా అక్కడ బల్లమీదఉన్న వీక్లీలు తిరగవేస్తోంది.

"ఎందుకొచ్చిన గొడవ. దీన్ని వదలించుకో ప్రసాద్" అంది సావిత్రి. విమెన్స్ వీక్లీ ఒకటి తీసుకుని శ్రీమతి మిశ్రా వెళ్ళిపోయింది.

"ఇంటికివస్తే ఇట్లాగేనా చెయ్యటం! ఏదో సరదాకి వస్తారు. ఇంకెందుకువస్తారు మనింటికి? ఛీఛీ. మర్యాద. స్నేహం తెలియవు....ఉత్త జెలసీ."

"తెలియక కాదులే. మన పద్ధతులువేరు చూడు. మన పద్ధతుల్లో పెరిగినవాళ్ళకి ఇవన్నీ సహించటం కష్టం! తప్పుందని ఎవరన్నారు. అయినా పెళ్ళికానివాటికి చెల్లుతుందికానీ. పెళ్ళయ్యాక ఎవరిహద్దుల్లో వాళ్ళుండాల్సిందే. పెళ్ళానికి జెలసీ అనుకోకపోతే సంకోష పెట్టకూడదూ. మన మగవాళ్ళదగ్గర ఉన్నలోటే అది. బయటివాళ్ళని మెచ్చుకుని పెళ్ళాన్ని తీసిపారేస్తారు. గట్టిగా పెళ్ళాన్ని ప్రేమించటానికి కూడా భయమే. ఎవరో ఏదో అంటారని. వాళ్ళు అట్లాగకాదు. భార్యసంతోషంగా ఉండటం వాళ్ళకి ముఖ్యం ఇంటి విషయాలలో భార్యదే పెత్తనం. అందుకే వాళ్ళ ఆడవాళ్ళు నవ్వు మొగాలతో బ్రతుకుతారు. మనవాళ్ళు ఆ ఆడవాళ్ళవేపు చూడటం. మెచ్చుకోవటమే కానీ పెళ్లాన్ని యేలా చూసుకోవాలో తెలియదు వాళ్ళ ఆడవాళ్ళు రాణీల మన్నంత ధీమాగా ఉంటే మన వాళ్ళు బానిస బ్రతుకని కృంగిపోతుంటారు.





నీ సంగతే చూడు - నువ్వు మిశ్రా ఇంటికి వెళ్ళినట్లు ఆ మిశ్రాగాడు వచ్చి నీ ఇంట్లో తిష్టవేస్తుంటే...." మెత్తమెత్తగా చివాట్లు పెట్టడం సావిత్రికి బాగా చేతనవును. ఆవిడ ప్రసాద్‌కంటె పెద్దది కూడాను.

"ఐనా మన ఆడవాళ్ళకి అసూయ లెక్కువ."

"దానికి కారణం మగవాళ్లే. పెళ్ళాన్ని అణిచిపారేస్తుంటారు. మిశ్రా పెళ్లానికి లేదనా! ఆవిడ కథలునన్నడుగు. చెప్తాను ఇంకామనవాళ్ళు అణుచుకుంటారు. మొగుడి దగ్గరేఏడుస్తారు. వాళ్ళ ఆడవాళ్ళు ఆడవాళ్ళు దెబ్బలాడుకోవటం నా చెవులతో విన్నాను. అది అనేవాళ్ళకి. వినేవాళ్ళకికూడా అసహ్యమే" అంది సావిత్రి.

● ● ●

విజయ పెళ్ళిఅయిన నాటికి ప్రసాద్ కలకత్తాలో ఉద్యోగంచేస్తున్నాడు. ఒక ఫ్లాట్‌లో అద్దెకు ఉంటున్నాడు. ప్రసాద్ గ్రౌండ్ ఫ్లోర్‌లో తెలుగువాళ్ళే ఉండేవారు. వాళ్ళకి ముగ్గురు అమ్మాయిలు. ఒక అబ్బాయి. సావిత్రి స్కూల్లో టీచరు. నళిని బి. ఎ. చదువుతోంది. తరవాత బాబి. పావ.

వాళ్ళతో ఇంట్లోమనిషిలా అలవాటు పడిపోయింది విజయ. సగంరోజు క్రింద వాళ్ళతోనే గడుపుతుండేది.

విజయవచ్చిన కొత్తల్లోనే. ఎదురింటిలో క్రింద భాగంలోకి మిశ్రాదంపతులువచ్చారు. మిశ్రా. ప్రసాద్ ఆఫీసులోనే పనిచేస్తుండటంవలన ఇద్దరికి స్నేహంఉంది. వాళ్ళకి ఒక కొడుకున్నాడు. ఆ మరునాడు పొద్దున్న—వీధివైపు వరండాలో కూర్చుని కాఫీ త్రాగుతున్నారు ప్రసాద్. విజయ.

ఎదురింటిలో మిశ్రా. అతని భార్యా మార్కెట్‌కి బయలుదేరారు. ఇద్దరూరోడ్డు మీదికివచ్చారు.

"ఆవిడ బాగుంటుందికదూ" అన్నాడు ప్రసాద్.

కొంచెంసేపు అటువైపే చూసి.

"అదికూడా అందమేనా?" అంది.

ప్రసాద్ నవ్వి,

"ఓహో, ఐదడుగుల మూడంగుళాలు పొడవు - కొంచెం నొక్కులుగా ఉన్న జుట్టుతో రెండుజడలు - నలుపు కాకుండా, మరీ తెలుపు కాకుండా, సన్నమూ కాక, మరీ లావుగానూ ఉండక మోచేతులదాకా అంచు ఉన్న చోళీతో —

అతిశయం ప్రకటించే ముక్కు —

మాట్లాడే కళ్ళు —

ఇదేకదూ అందమంటే! ఈ ప్రపంచంలో ఇంకేదీ అందంకాదు. అవునా!"

విజయకి కొంచెం నవ్వు వచ్చింది. అది విజయని గూర్చిన వర్ణనే.

"లేకపోతే తెల్లగా ఉంది, స్లీవ్ లెస్ వేసుకోగానే అందం వచ్చేస్తుందేమిటి!"

"లోకంలో అందాలు రకరకాలుగా ఉంటాయి అందానికి నిర్వచన మేమిటసలు, ఆకర్షణే అందం" అతడన్నాడు. ఎప్పుడూ అట్లాగే అంటాడు.

విజయ ఒప్పుకోలేదు.

"అందమనేది ముఖంలోనూ, కదలికల్లోనూ ఉంటుంది. ఎంత సౌష్ఠవంగా ఉన్న శరీరమైనా ముఖం బాగుండకపోతే, ఆకర్షణ అనిపించుకుంటుంది కానీ, అందమనిపించుకోదు."

● ● ●

ఆసాయంత్రం మిశ్రా, అతని భార్య వచ్చారు. ప్రసాద్ వాళ్ళని కాఫీకి రమ్మని పిలిచానని చెప్పాడు. కొత్త స్నేహితులు దొరుకుతారని విజయ చాలాసంతోషించింది. వాళ్ళకి స్వీట్స్, కాఫీ యిచ్చింది. కొంచెంసేపు దక్షిణాదివాళ్ళ ఆహారాలమీద మాటలు జరిగాయి. వాళ్లావిడకి ఇడ్లీ, దోసెలుచేయటం నేర్పమని అడిగాడు మిశ్రా. మిశ్రా భార్య అంత అందగత్తె ఏమీ కాదు. తెలుపు వర్ణం, పొడుగు, పొడుగుకు తగ్గలావు. స్లీవ్ లెస్ బ్లౌజ్ వేసుకుని, పైకి చుట్టినచుట్టు, రింగులుతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఆవిడ కొత్తవాళ్ళతో బాగా మాట్లాడుతుంది.

వాళ్ళు వెళ్ళిపోయారు. తమ ఇద్దరినీ వాళ్ళింటికి రమ్మంటారనుకుంది విజయ. కానీ మిశ్రా భార్య ఏమీ అనలేదు. మరునాడు పొద్దున్న—కాఫీ త్రాగాక వరండాలో అక్కడే కూర్చుని పేపర్ మొదలయినవి చూస్తూ కొంచెంసేపు కబుర్లుచెప్పుకోవటం అలవాటు ఇద్దరికీ. తరవాత అవసరమైతే మార్కెట్‌కి వెళ్ళేవాడు ప్రసాద్. విజయ వంట ప్రారంభించేది. మరునాడు పొద్దున్న కాఫీత్రాగగానే మిశ్రా ఇంటికి వెళ్లాడు ప్రసాద్. అక్కడనుంచి వాళ్ళతోకలిసి మార్కెట్‌కి వెళ్ళివచ్చాడు.

ఉన్నవి తెచ్చాడు, లేనివి లేవు.

విజయకి అతడిని ఏమనాలో, ఏమనకూడదో తెలియలేదు.

"దిన చర్యలో ఎందుకురావాలి మార్పు! వాళ్ళు కొత్తకదా, వాళ్లు తమ ఇంటికి రమ్మనైనా పిలవలేదు. ఏమిటి ఇతని ప్రవర్తన!" ఆలోచించటం మొదలుపెట్టింది.

శ్రీమతి మిశ్రా తరచూ వస్తూనే ఉంటుంది. కాఫీత్రాగి కబుర్లుచెప్పిపోతూనే ఉంటుంది. కానీ విజయని ఎప్పుడూ రమ్మనలేదు.

ప్రసాద్‌కూడా రోజుకి ఒకసారైనా వాళ్ళింటికి వెళ్ళివస్తుంటాడు. పోనీ అతడైనా వాళ్ళింటికి రమ్మని తనను ఒక్కసారైనా అడగలేదు అని విజయ బాధపడుతుండేది.





అఖరికి తనే ఒకసారి అభిమానం, సంకోచం తొలిగించుకుని ప్రసాద్‌తో వెళ్ళింది.

మిశ్రాభార్యకి తన రాక ఆనందం కలిగించనట్లు, ఆవిడ ఒక నిర్లక్ష్యంతో ప్రవర్తించినట్లు విజయకి అనుమానంవేసింది. వాళ్ళింటికి వెళ్ళటమంటే అసహ్యంవేసింది. ప్రసాద్‌తో అంటే వినీ విననట్లుగా నవ్వి ఊరుకున్నాడు. అతడిమీద కోపం వచ్చింది విజయకి.

"భార్యని ఇంకొకళ్ళు అవమానకరంగా ట్రీట్‌చేస్తుంటే ఇతడికేమీ అనిపించదా, అభిమానంలేదా!" అనుకుంది ఆవేశంతో.

● ● ●

తరవాత-నెల గడిచాక పుట్టింటికి పండగకి వెళ్ళి ఒకనెల ఉండివచ్చింది విజయ. సాయంత్రం పిన్నిగారి హాలులో కూర్చుని, వాళ్ళ కబుర్లు వింటోంది విజయ. ప్రసాద్ ఇంకా ఆఫీసునుంచి రాలేదు

"ఈ నెల్లాళ్ళు మీ ఆయనకేమీ లోటు రాలేదు. అమ్మ ఒకపక్కనుంచి అన్నీ చేసిస్తూనే ఉంది. హోటళ్ళు యెందుకు! ఇంకొకపక్కనుంచి మిశ్రా పెళ్లాం పంపించేది. ఒకరోజున మాటల్లో ప్రసాదు తనకి ఖర్ఫీ ఇష్టమన్నాడు. ఆవిడ వెంటనే ఇంటికి వెళ్ళి చేసి పంపించింది. సాయంత్రంపూట టీ, ఫలహారం అక్కడే. ఇంటికివచ్చి ఆవిడని మెచ్చుకోవటం

వీళ్ళన్నారే ఉత్తరదేశపు ఆడవాళ్ళు - మొగుణ్ణి మొగుడిలా చూడరు. వాడొక నౌకరు.. డబ్బుతేవాలి కష్టపడి. అది తెచ్చి చేతుల్లో పొయ్యాలి. వాడికే అవసరం వచ్చినా, నయాపైస మొదలు వందదాకా దీని నడగాలి. అదీ ఆశ్చర్యమే. వాడు బాధపడడు. పైగా భార్యనడిగి తీసుకోవటంలో ఆనందం అనుభవిస్తాడు. మనసంగతి దానికి ఉల్టా. ఆడదానికి కంట్లో నీళ్ళువస్తే కానీ, కట్టుడుచీరకూడా రాదు. సరే....ఇక ఇంటి పనుల్లో సాయంచెయ్యాలి. పిల్లల్ని ఆడించాలి. మార్కెట్‌కి వెంట రావాలి. బరువు సామాను వాడు మొయ్యాలి. దానిది ఆడింది ఆట, మళ్ళీ పరాయి మగవాడిని ఆకర్షించాలని ఎంత తాపత్రయపడతారో!"

"అభిమానం ఉండదు కాబోలు."

"మొగుడిని దేవుడిలా ఆరాధించటానికి వాళ్ళు ఆంధ్రులు కారమ్మా. అయినా వాళ్ళకి సంప్రదాయం, సంస్కారం ఎక్కడ ఏడ్చింది. అంతాసంకరమే. చెక్కుచెదరకుండా వచ్చింది మన సంప్రదాయం. అన్నాళ్ళూ పల్లెటూరు బ్రతుకులు, బ్రిటిష్ వాళ్ళు వచ్చాక మేమ్ సాహెబాలు, ఇప్పుడు అమెరికన్ స్టయిల్. ఏమయితేనేం సుఖపడుతున్నారు. సంస్కారం వదలుకోలేక, అభిమానాలు చంపుకోలేక బాధపడుతున్నది మనమే. కాలం మారుతోందని తెలిసినా,

---

● *మొదటిసారిగా మద్రాసువెడుతున్న ఒకాయన తోటి ప్రయాణికుణ్ణి ప్రశ్నలతో వేధించేస్తున్నాడు. చివరికి "ఈ రైలు సెంట్రల్ స్టేషన్‌లో ఆగుతుందని మీకు ఘట్టిగా తెలుసా?" అని అడిగాడు.*

*రెండో ఆసామీ పళ్ళు, గుప్పిళ్ళు బిగపట్టి "అయ్యా! ఆక్కపోతే ఈ రైలూ, సెంట్రల్ స్టేషనూకూడా ధ్వంసమైపోతాయి. నా మాట నమ్మండి." అన్నాడు.*

ఎదురీదుతూనే ముందుకు పోతుంటాము, మారకా తప్పదు. మనోవ్యధాతప్పదు" సావిత్రి అట్లా మాట్లాడుతూనే ఉంది'

గేటులోనుంచి మిశ్రా భార్య వచ్చింది. కుర్చీలో కూర్చుంటే విజయ చూపులు ఆవిడ వేసుకున్న నవరం మీదికి పోయాయి. విజయ పుట్టింటిలో ఉండగా ప్రసాద్ ఉత్తరం రాశాడు. తన స్నేహితుడి భార్యకు నవరం కావాలని. తెచ్చిపెట్టమని. విజయ తన అక్కయ్య ద్వారా మద్రాసునుంచి ఆ నవరం తెప్పించి తీసుకువచ్చింది. ఇదంతా ఈవిడకోసం అన్నమాట. ఈవిడ కని తెలిసివుంటే ...పొడుగుగా నొక్కులుగా క్రింద కుచ్చుగా వ్రేలాడే ఆ జడ చూస్తుంటే తనను పాము చుట్టుకుంటున్నట్లనిపిస్తోంది విజయకి.

"ఇదేమి స్నేహం! పోనీ తనకుచెప్పి. తనను ఇమ్మంటే బాగుండదూ. పొద్దున్న ఇచ్చాడన్నమాట. ఇప్పుడు ఈవిడ ధరించుకు వచ్చింది. ఆవిడ అడిగే ఉంటుంది. ఏమిటి ఇతని తాపత్రయం! ఒక నెలలోనే ఇంత చనువైపోగలరా మనుష్యులు. పరాయి స్త్రీతో ఏమిటి ఇంత చనువు! ఏమిటీ మనిషి స్వభావం! ఆవిడచేత మంచివాడు. సరదా అయినవాడనిపించుకోవాలనా! దాని? వలన ఇతడికి ఏమివస్తుంది? ఏమి ఆశించి ఊరికేనా అంత అర్థంలేని ప్రవర్తన.

"ప్రసాద్ ఇంకా రాలేదా ?" అడిగింది శ్రీమతి మిశ్రా.

"ఏం ఈ కొత్త వేషం చూపించాలనా !" సావిత్రి తెలుగులో అని నవ్వుతోంది. సావిత్రి ఎప్పుడూ హిందూస్థానీల్ని. పంజాబీలని ఒక సంస్కృతి. సంప్రదాయంలేని వాళ్ళని హేళనచేస్తుంటుంది.

"ఆ నవరం ఎక్కడ సంపాదించిందో. నిముషంలోపట్టేస్తుంది ఫేషన్" అంది నళిని.

"ఏ మెడ్రాస్‌వాడినో అడిగిఉంటుంది. ఎవరినీ వదిలిపెట్టదుగా" అంది సావిత్రి.

"అందరూ అట్లా ఉండరే అక్కా. మళ్ళీ ఆ పక్క ఇంట్లో రాయ్‌తేడూ. అతనూ అందరితో సరదాగా మాట్లాడతాడు. ఎంతో హుందాగా, ఆకర్షిస్తూఉంటాడు. ఈ మిశ్రా పెళ్లానిక్కూడా అతడంటే దూరమే. వీళ్ళందరిలోకీ చచ్చుగా ఉండని భర్త అత డొకడే."

"ఐనా పైకి సోషల్‌గా, సరదాగా కనిపిస్తారు. కాపీలోపల వాళ్ళలో అన్నీ జెలసీలే పెళ్లాన్ని వెనకేసుకుని మగవాళ్ళకూడా దెబ్బలాటలకి సిద్ధమవుతుంటారు నాతోటి టీచర్స్ మాటలు వింటుంటే వీళ్ళ నాగరికత బయటపడుతుంది" అంది సావిత్రి.

ఆ మాటలు సగం సగమే వినిపిస్తున్నాయి. మిశ్రాభార్య ఎప్పుడువెళ్ళిందో. ప్రసాద్ ఎప్పుడువచ్చాడో. ఆలోచిస్తున్న విజయకు తెలియకుండానే జరిగాయి.

ఫలహారం, కాఫీ ఇస్తుంటే

"ఏమైనా స్వీట్ చెయ్యకపోయావా ?" అన్నాడు అతను

"మిశ్రా ఇంటికి వెళ్ళండి. ఆవిడ పెడుతుంది" అంది.

"నీవు చేసిపెడితే, అక్కడికి వెళ్ళటం యెందుకూ" అన్నాడు


ఎన్నో ప్రశ్నలు గుండెలోంచి సూదుల్లా పొడుచుకుని వస్తుంటే క్రింది పెదవిని పంటితో నొక్కిపట్టింది. మౌనంలో కొంత సర్దుకున్నాక

"అయితే ఆ నవరం మిశ్రా పెళ్ళానికా తెమ్మన్నారు ?" అని అడిగింది మెల్లగా.

"ఊ. ఏం పెట్టుకుందా ?"

"ఆ, మీకు రహస్యమేమో కానీ. ఆవిడకి గొప్ప. ప్రసాద్ తనకోసం మెడ్రాస్ నుంచి తెప్పించాడని. "






"రహస్యమేముంది! ఎవరికైతేనేమిటి - ఇంకొకరికి యిచ్చేది "

"ఈవిడ నాకు తెలియనిది కాదుగా. మనింటికి వస్తూనే ఉంటుంది. మీరే తీసుకు వెళ్ళి ఇవ్వాలా."

"ఎవరిస్తే ఏమిటి ? ఇందులో తేడా ఏముంది ?

"తేడాఏముంది, మీరు ఆవిడచుట్టూ తిరగటంతప్పితే. ఎందుకు ఆవిడచేత మంచి అనిపించుకోవాలని అంత తాపత్రయపడతారు! చెయ్యదలుచుకుంటే అంతకంటె మంచిపనులు లక్ష ఉన్నాయి ఈ భూమి మీద" అంది.

● ● ●

"నాకు నిజంగా జెలసీఉందా? నేను బాధపడటంలో న్యాయంలేదా ?" ఒంటరిగా గదిలో కిటికీ దగ్గర కూర్చుని ఆలోచించుకుంటోంది విజయ.

"అందమంటే తెలియనట్లు, భార్య అనాకారి అయినట్లు పరాయి ఆడదానితో ఆ కబుర్లు, ఆ భార్యాభర్తల వెనకాలపడి మార్కెట్‌కి వెళ్ళటం, ఆవిడను వంటలు అడిగి చేయించుకుతినటం ఇదంతా ఏమిటి. సిగ్గులేనితనంకాక - భార్య అంటే అభిమానం లేకపోవటంకాక !

పోనీ ఆవిడేమైనా చుట్టమా, అక్కగారా, మేనత్తా—

ఏపనైనాచేస్తే అర్థంఉండాలా ?

కలకత్తాలో ఉంటే ఇట్లా ఉండాలనుకుంటారా ? పోనీ ఈ సంస్కారం అలవరచుకున్నారంటే నా విషయం వచ్చేటప్పటికి-భార్య సంగతి వచ్చేటప్పటికి—

అతని యిష్టమైన వ్యక్తులని ఏరి పరిచయం చేస్తాడు.

ఎప్పుడైనా సినిమాకి తీసుకు వెడతాడు ఎవరితో ఊోక్యం లేకుండా.

స్నేహితుల ఇళ్ళకి తను ఒక్కడే వెళ్ళి వస్తాడు. మార్కెట్‌కి మిశ్రాల వెంట. పోతాడు కాని తనను పిలవడు. భార్యాభర్తలు

ఇద్దరూ పోతున్నప్పుడు ఇతనెందుకు వెంట? పోనీ సరదా ఉంటే తననెందుకు పిలవ కూడదు? తనేమి చదువుకోనిదా, నలుగురు పిల్లలు కలదా! తనని అతడు నిర్లక్ష్యం చేస్తున్నట్లే కదా. అతడికి సరదాలు కావాలి. భార్య మర్యాదగా ఉండాలి. అతడికి ఒక పద్ధతి. భార్యకి ఇంకొక పద్ధతి.

ఒకసారి తనుకూడా మార్కెట్‌కి వస్తానంది. చీర మార్చుకుని వచ్చే పది నిమిషాలలో అతడు అన్నమాటలు:

"ఇంకా యెంతసేపు! మీ ఆడవాళ్ళ అలంకరణ యెన్నిగంటలైనా తెమలదు. అందుకే ఆడవాళ్ళతో యెక్కడికైనా బయలుదేరాలంటే ..."

ఇంక ఆతరవాత విజయ వినదలుచుకోలేదు. కోపంతో తలంతా వేడెక్కిపోయింది అప్పటికే.

మిశ్రాలతో మార్కెట్‌కి వెళ్ళడానికి అరగంటసేపు వాళ్ళ ఇంట్లో పడి కాపులు కాసే మనిషేనా ఇట్లా అనటం; ఆవిడ కోసం వెయిట్ చెయ్యటం కష్టం అనిపించదు కాబోలు. కట్టుకున్న చీర విప్పిపారేసి, ముందర కట్టుకున్న చీరనే అవకతవకగా కట్టుకుని వచ్చి కుర్చీలో కూర్చుంది.

"మీరు వెళ్ళండి. నేను రావటంలేదు."

"ఇంతలోకి ఏమొచ్చింది!"

"రోగం" అనుకుంది మనసులో.

"అవన్నీ నేను చెప్పలేను. మీరు వెళ్ళండి" అంది. తనకి సరదా కలిగితే సావిత్రితో కలిసి వెళ్ళేది కానీ మళ్ళీ అతడిని యెప్పుడూ అడగలేదు విజయ.

"ఇతడిని నేనుమార్చలేను" అనుకుంది.

ఒకరోజు-రోజూ ప్రసాద్ ఇంటికివచ్చే వేళదాటిపోయింది. వరండాలో లైటుఆర్పి కుర్చీలో కూర్చుని రోడ్డుమీదకి చూస్తూ ఉంది. రాత్రి ఎనిమిది అయింది. తొమ్మిది కూడా దాటింది. అతడు రాలేదు. విజయ అట్లాగే కూర్చుంది. పదికావస్తుంటే రోడ్డు చివర కనిపించారు ముగ్గురూ - మిశ్రా అతని భార్యా, ప్రసాద్. ప్రసాద్ పైకి వచ్చి వరండాలో లైటువేశాడు.

"ఇంకా పడుకోలేదా. చీకట్లోకూర్చున్నావు" అన్నాడు. అని లోపలికివెళ్ళి దుస్తులుమార్చుకుంటూ

"సాయంత్రం అటు వెడుతుంటే లైట్ హౌస్‌దగ్గర కనిపించారు మిశ్రావాళ్ళు. మంచిపిక్చర్ నన్నుకూడా రమ్మన్నారు. సందేహించాను కానీ, రానంటే బాగుండదని..." అని చెప్పుకుపోతున్నాడు.

విజయ తలమీద చేయివేసుకుని అనుకుంది.

"నాకు తెలుసు. ఇంటిదగ్గర భార్య నాకోసం ఎదురుచూస్తుందని చెప్పలేరుమీరు. అట్లా చెప్పడానికి భయం, ఆవిడ ముందర సిగ్గు."

"కావాలనే కలిసివెడితేమాత్రం మిమ్మల్ని అనేదేముంది" అంది. అతడికి అన్నంపెట్టడానికి లేస్తూ.

ఒకరోజు మార్కెట్‌నుంచి వచ్చాక ఒక పాకెట్ ఇచ్చి.

"బాగుందా చూడు" అన్నాడు. విప్పి చూస్తోంది విజయ. అది ఒక జాకెట్ పీస్. బాగానే ఉంది.

"మిశ్రా పెళ్ళాం జాకెట్ గుడ్డలుకొంది. ఇది చాలా బాగుంది అంది. అందుకని నీ కోసం కొన్నాను."

తనకోసం భర్త ఒక వస్తువు తెచ్చాడని సంతోష పడబోతున్న విజయ మనసు ముడుచుకు పోయింది.

"అదా సంగతి. ఆవిడ మెప్పుకోసం అన్నమాట, నాకోసం కాదు" అనుకుంది.



"ఆవిడకి కొనిపెట్టకపోయారా?" అంది

"ఆవిడకి నేనెందుకు కొనిపెడతానూ" అన్నాడు.

"తప్పేముంది" అంది విజయ.

తనకి జాకెట్‌గుడ్డ సెలక్టు చెయ్యటానికి శ్రీమతి మిశ్రా పక్కన ఉండాలి. తనకి టేస్టు లేదూ. తను ఏమైపోయినట్లు? తను ఎవరిని తృప్తిపరచటానికి అది ధరించాలి? దాన్ని ఉండగా చుట్టి చాకలి బట్టల పెట్టె అడుగున పారేసింది విజయ "హు! నాకు అసూయ!" అనుకుంది.

"నేను మీకు తృప్తికలిగించటం లేదు కదూ. పోనీ నేనుకూడా శ్రీమతి మిశ్రాలాగ ఉండనా. ఆవిడలాగ మిడీ. స్లీవ్‌లెస్...." అడిగింది విజయ.

"తృప్తి కలిగించలేదని నేనెప్పుడూ అనలేదే. నీవంటే నాకెంతో తృప్తి."

"అంతఃపురంలో పెట్టడానికా!"

"నీకు తెలియదు. అందమైన ఆడవాళ్ళని యెక్కువగా తిప్పితే దిష్టి తగులుతుంది. ఇప్పుడే ఇట్లాగుంటావు మిశ్రా పెళ్ళాంలాగ వేషం వేస్తే....నీకుతెలియదు. వెనకాల మగవాళ్ళు యెట్లాటి మాటలు అంటారో - ఎన్నికథలు అల్లుతారో!"

"మరి మీరెందుకు ఆవిడచుట్టూ తిరుగుతారు!"

ఈప్రశ్న గొంతుకలో కొట్టుకులాడింది. హు, అతడిదంతా సరదా, స్నేహం.

తనకి ఏమీ తెలియవు; పట్టి అసూయ. తనపట్ల అతడి ప్రవర్తనకి అర్థం ఏమిటో? సరదా, స్నేహం ఇవేనా!

తన అందాన్ని, గుణాన్ని అందరూ పొగిడిన వారే. కానీ, తన అదృష్టమే బాగుండలేదు. తనలో ప్రసాద్‌కి అసూయ తప్ప, కోరికలూ, వాంఛలూ కనిపించవు. తన అందంకానీ, సంస్కారం కానీ అతడికి తృప్తికలిగించలేదు.

స్వంతంకానివి - రకరకాలు - అర్థంలేని ఆకర్షణలకు మిఠాయికొట్టు దగ్గర నిలబడి గుటకలువేసే పిల్లవాడి మనస్తత్వంతో- పరాయి ఆడవాళ్ళనుంచి చూపులు తిప్పుకోలేక అవస్థపడే ఈ భర్తని ఎట్లా సహించాలి!

మగవాళ్ళు భార్య ఒకతెను ప్రేమించి తృప్తిపడలేరా?

లేక ప్రతిస్త్రీ కూడా చూసి ఆనందించ తగిన ఒక వస్తువా? మరి నేను అట్లాగ ఉండటానికి అతడు ఒప్పుకోడేం?

అన్నిదేశాల ఉత్తమగ్రంథాలూ కూడా భార్యాభర్తలఅన్యోన్యానురాగాన్ని,ఆరాధనను అత్యుత్తమంగా చూపిస్తాయి.

నా అందానికి అతడు ముగ్ధుడుకావాలని, నన్ను అతడు సర్వాతీతంగా అభిమానించాలని అనుకోవటంలో, కోరుకోవటంలో అక్రమమేమీలేదు. తప్పులేదు. నా బాధకి అర్థంఉంది. చదువూ సంస్కారం

---

● *సంపాదకుడు : ఈ కథ అశ్లీలంగావుంది. మధ్యలో ఒకచోట ఆమె నగ్నంగావుందని రాశారు. అల్లాంటివి మేము వేసుకోము.''*

*కథకుడు : ఆ తరవాత వాక్యం చూడండి. ఆమె సిగ్గుతో ముడుచుకుపోయిందని రాశాను.''*

ఉన్న భార్యని ఇంట్లో వదలి పరాయి స్త్రీతో చనువుగా, సరదాగా ఉండటం భార్యని అవమానించటమే అవుతుంది. ఈ అవమానాన్ని నేనేమీ సహించ నవసరం లేదు. అనుకుంది విజయ.

అనుకుని క్రిందికి వెళ్ళింది. సావిత్రి, నళినికూడా ముందర హాలులోనే కూర్చుని ఉన్నారు. పిన్నిగారు ఉప్మా చేసింది. అందరూ తింటూ ఉన్నారు. సావిత్రి చెప్తోంది.

"మిశ్రా ఇంటి పై ఫ్లోరులో ఉంటున్నాడు సతీష్. అతనికి జ్వరం వచ్చిందట. మిశ్రాని మందు తెచ్చిపెట్టమని అడిగాడుట. మిశ్రా పెళ్ళాం అనుమతికోసం వెళ్ళాడట ఆవిడ ఏమందో తెలుసా.

నువ్వేం, వాళ్ళ నౌకరువా? అందిట. మిశ్రా భార్యకి ఏదో చెప్పి మందు తెచ్చాడనుకో. ఇదంతా బాబి చెప్పాడు. అక్కడ పిల్లలు కారెమ్సు ఆడుకుంటున్నారట అప్పుడు."

అప్పుడు గేటు చప్పుడయింది. ప్రసాద్ రావటం విజయ చూసింది. తింటున్న ప్లేటు వదిలేసి "మార్కెట్‌కి వెళ్ళావని చెప్పు" అని సావిత్రితో వెనకవైపు గుమ్మంలోంచి హడావిడిగా వెళ్ళిపోయింది.

"వెర్రిపిల్ల" అంది పిన్నిగారు.

"ప్రసాద్ ఏం చేశాడని! ఒక ఆడదానితో మాట్లాడాడని. ఆవిడవైపు చూశాడని ఈవిడ యింత ఇదయిపోవాలా. అసహ్యంగా పెళ్ళయినంత మాత్రాన ఎవరినీ చూడకూడదా, మాట్లాడకూడదా, సరదాగా ఉండకూడదా?" అంది నళిని మొహం చిట్లించి.

"నీకు తెలియదే. పెళ్ళయితే తెలుస్తుంది

"అయినా ఏమిటా వేషాలు. ఆ సరదా ఏమిటో భార్యతోనే వెయ్యొచ్చుగా!"

"భర్తతో సరదాగా తిరగాలని, కాలం గడపాలని ఈ అమ్మాయికి ఉండదేమిటి?" సావిత్రి అంది.

"నీకు మహా అనుభవం ఉన్నట్లు." అంది నళిని.

"అది ఆలోచించే పద్ధతిలో ఉంటుంది. అనుభవం అక్కరలేదు."

"అనుభవమూ దగ్గర్లోనే ఉందిలే." అంది నళిని నవ్వుతూ.

చెల్లిపోరుమీద సావిత్రికి ఏవో సంబంధాలు చూస్తున్నారు.

ప్రసాద్ వచ్చాడు-పైకి వెళ్ళవచ్చాడు.

"విజయ షాపింగ్‌కి వెళ్ళింది" సావిత్రి చెప్పింది.

"ఇప్పుడేమిటి? ఇప్పుడు ఇక్కడ చూశాను. ఒక్కతే వెళ్ళిందా?"

"ఆ నిన్ను చూశాకే వెళ్ళింద" అంది సావిత్రి తమాషాగా నవ్వుతూ.

"మార్కెట్‌కి వెళ్లావా?" విజయ వచ్చిన తరవాత ప్రసాద్ అడిగాడు.

"ఊ. వెళ్లాను." ఎటో చూస్తోంది విజయ. అతడి చూపులు తప్పించుకుని.

"నేనూ వచ్చేవాడినిగా."


"మీకు తొందరఏముంది రేపొద్దున్న శ్రీమతి మిశ్రా వెనకాల వెళ్ళుదురుగాని."

"ఛా - అదా నీ కోపం. నీకు వెళ్లాలని ఉంటే తీసుకువెళ్ళనా నేను. నీ వెప్పుడూ అడగందే!"

కోపం, అసహ్యం కంఠంలో వ్యక్తమవుతుంటే-

"నే నడగాలి-ఇంత సరదా నవీనత కలిగిన మీకు భార్య సంగతి తెలియదు. మీకు ఆవిడవెంట తిరగటం సరదా. నాకు మీతో సరదాగా తిరగాలని ఉండదా?






మీకు లేదని తెలుస్తూనే ఉంది. ఇక మిమ్మల్ని బాధపెట్టడం ఎందుకు? అందుకే నేను అడగను. మిమ్మల్ని అడగలేను. మీరంటే చనువు ఉంది కనుక మిశ్రా పెళ్ళాం మిమ్మల్ని అడుగుతుంది. మీరు ఆవిడ నడుగుతారు. నేను మిమ్మల్ని అడగలేను. నాకు అభిమానం ఉంది. నా స్వంత వ్యక్తి, నన్ను అభిమానించేవాడయితేనే నేను నా అభిమానం వదులుకోగలను. మిమ్మల్ని నేను ఏమీ అడగలేను. మీరు నాకు ఏమీ కారు. మీకూ నాకు సంబంధం లేదు" కోపం, రోషంతో కన్నీళ్ళు కారుతున్నాయి. అయినా ఆ కళ్ళల్లో ఒక కఠినత్వం ముద్రవేసుకుంది.

"ఛీ, ఛీ ఏమిటిదంతా విజయా? ఇదంతా ఆ మిశ్రా పెళ్ళాంమీద జెలసీయే!" ప్రసాద్ భార్య కంటిలో నీటిని తుడవబోయాడు.

"జెలసీ అని అనటానికి మీకు అభిమానంలేదు. ఆవిడను చూసి జెలసీ పడాల్సిన అవస్థ మీ భార్యకి ఎందుకు రానివ్వాలి? నాలో ఒకవేళ ఆ హీన గుణం కలిగినా, అందుకు బాధ్యులు మీరు, మీ ప్రవర్తన. అందుకే మీరంటే నాకు అసహ్యం. నాకేం తక్కువయిందని నన్నిట్లాగ అవమానం చేస్తారు ఆవిడ చుట్టూ తిరిగి. మీకు నేనంటే అభిమానంలేదు. మీకూ నాకూ సంబంధంలేదు." అంది అతడినుంచి దూరంగా తొలగిపోతూ.

"పెళ్ళంటే ఆనందంగా ఉంటామనుకున్నాను కానీ ఈ అపార్థాలేమిటి విజయా,"

"ఔను. పెళ్ళి అంటే నేనూ మనసులో మనసు కలిపే స్నేహితుడువస్తాడని, నన్నే తన సర్వంగా చూసుకుంటాడనీ అనుకున్నా. మీ సౌకర్యాలు అమర్చడానికి వచ్చిన ఆడ

దానిలాగ కాక ఒక స్నేహితురాలిగా, ఆత్మీయురాలిగా చేసుకోటానికి యెప్పుడైనా ప్రయత్నించారా ? రోడ్డుమీద పోయేయువతుల విలాసాలేకాని, భార్యలో ఉన్న అందచందాలు అర్థంచేసుకో చూశారా ? ఇట్లా నన్ను బాధించి తేలిక ఆకర్షణలు వెతుక్కుంటారని నేనూ అనుకోలేదు.

కేవలం తన ఆనందం, అనుభవాలే కావలసిన వాళ్ళకి పెళ్ళి యెందుకు ?

నిజమే. ఇదేంపెళ్ళి. అసలు నాకు పెళ్ళి అయినట్లే లేదు. భర్తని పొందినట్లే లేదు.

మీదారి మీది. నా బాధ నాది. నేను ఊహించుకున్న భర్తవేరు. తేలిక ఆకర్షణలకు చిత్తాన్ని రంజింపజేసుకునేటంత అల్పుడు కాడు. ఇప్పటికే నేను ఊహించలేని స్థితికి దిగి మాట్లాడుతున్నా-దీనికి కారణం మీరే. మిమ్మల్ని నేను సహించలేను మీకూ నాకూ సంబంధంలేదు. నేను త్వరలోనే వెళ్ళిపోతాను. దయచేసి అంతవరకూ నాజోలికి రాకండి" అని గబగబా మెట్లుదిగి వెళ్ళిపోయింది విజయ.

"పెళ్ళిలోఉన్నది సంకుచితత్వమా - స్వార్థరాహిత్యమా ?" అని ఆలోచిస్తున్న ప్రసాద్‌కి ఏమీపాలుపోలేదు.

"నాకు వంట్లో బాగుండలేదు. జ్వరం వచ్చేటట్లుంది పిన్నీ. అన్నం తినను. ఇక్కడే పడుకుంటా"నని క్రిందికివెళ్ళిన విజయ సావిత్రిపక్కలో పడుకుని నిద్రపోయింది. పైకి వెళ్ళలేదు.

"కిధ శృతిమించినట్లేఉంచే" అంది ఆవిడ సావిత్రితో.

"ఎవరి తప్పూ లేకపోయినా, పద్ధతులు కలవకపోతే వచ్చే బాధలే ఇవి" అంది సావిత్రి.



"ఇతనుమాత్రం-ఇక్కడ ఈ సరదాలే తప్ప. స్వంతచెల్లెళ్ళనైనా ఎప్పుడైనాసినిమాకైనా తీసుకువెడతాడో లేదో" పిన్నిగారు అంది.

"ఈ అమ్మాయి అట్లాంటిదికాదు. అసూయపడే మనిషికాదు. మనమేమవుతామని మనతో ఇట్లా కలిసిపోయింది? ప్రసాద్‌తో అంతచనువుగా ఉంటాము, ఏమీ అనుకోదు. మిశ్రా పెళ్ళాం విషయమే ఈ అమ్మాయికి పడదు."

● ● ●

ఆ మరునాడుకూడా పైకి వెళ్ళలేదు విజయ. ప్రసాద్ క్రిందికివచ్చి పలకరిస్తే పెడసరంగా జవాబులిచ్చింది. అతడు ఒక నిట్టూర్పువిడిచి పైకివెళ్ళాడు.

అతడు వెళ్ళిన్నాపదినిముషాలకి శ్రీమతి మిశ్రావచ్చింది. విజయని పలకరించి అక్కడే కూర్చుంది.

కూర్చున్నాక - "ప్రసాద్ ఇంట్లో ఉన్నాడా ?" అంది.

విజయ ఆవిడముఖంలోకే చూస్తూ,

"ఆ. పైనఉన్నాడు వెళ్ళండి" అంది.

"నీ కేమైనా పిచ్చిఎత్తిందా ?" అని విజయని గదిమి సావిత్రి మెట్లదగ్గరకువెళ్ళి,

"నీ కోసం మిశ్రా పెళ్ళాం వచ్చింది. రావయ్యా" అని ప్రసాద్‌ని పిలిచింది.

"ఇవేళ మా బంధువులు వచ్చారు. మేమంతా గార్డెన్స్‌కి వెడుతున్నాము. ఇంక మార్కెట్‌కి పోవడానికి టైమ్ ఉండదు. ఒక డజన్ సంత్రాలు. బ్రెడ్, ఒక బాటిల్ ఆరంజ్ స్క్వాష్ ప్రసాద్ తెచ్చిపెడతాడని."

"తప్పకుండా తెచ్చిపెడతాడు." అంది విజయ వస్తున్న భర్తని చూసి మాట్లాడే స్థాయి పెంచి. మళ్ళీ ఆ సంగతి అతడితో సావిత్రి చెప్పింది. ఆవిడ కూడా చెప్పింది.

ప్రసాద్ నవ్వుతూ,



"ఇవేళ మేముకూడా ఫోటోలు తీసుకోవాలని బయలుదేరుతున్నాము. ఎక్కడెక్కడ తిరిగి ఎప్పటికి వస్తామో. దయచేసి నామీద ఆధారపడకండి" అన్నాడు. ఆవిడ వెళ్ళిపోయింది.

"మీరు తప్పకుండా తెస్తారని చెప్పాను" అంది విజయ.

''ఒకమాటు పైకి రా, విజయా" అతనన్నాడు.

"ఏదైనా సరే ఇక్కడ మాట్లాడవచ్చు" విజయ అంది.

"అట్లాగ ఎందుకు చెప్పావు ? నాయిష్టం. తెస్తేతెస్తాను. లేకపోతే లేదు."

"మీ ఇష్టం నాకుతెలుసు. ఆవిడ అడగకుండా ఉండదు. మీరు తేకుండా ఉండలేరు. ఆవిడకి పరాయివాళ్ళని చుట్టూ తిప్పకోడానికి అభిమానంలేదు. తిరగడానికిమీకూలేదు. ఆవిడకి మొగుడు ఒక నౌకరు. అతడివెనక మీరూ."

ప్రసాద్‌కి అంత సహనం ఉందనుకోలేదు సావిత్రి. అతడు సూటిగా విజయ ముఖంలోకిచూస్తూ

"ఇప్పుడు చెప్పు. సరే, నేను నలుగురితో సరదాగా ఉండటం, ఎవరికీ సాయం చెయ్యటం నీ కిష్టంలేదు. నువ్వు చెప్పినట్లే చేస్తాను. ఇప్పుడు ఆ సామాన్లు తెచ్చి ఇవ్వమంటావా వద్దా ?" అని అడిగాడు.

విజయకూడా అతడినేచూస్తూ

"వద్దుఅంటే నా స్వార్థం, అసూయ, మీ పరోపకారబుద్ధి ఇంకొకమాటు ప్రదర్శితమవుతాయి. అంతేకదూ" అని గంభీరంగా "నేనూ నా మొగుడిని నౌకరులాగ చూసుకోలేను. ఇంకొకళ్ళు ఆ చులకన తీసుకుంటే నేను సహించలేను. ఇంతకూ అవి రోజు గడవని అత్యవసర వస్తువులేం కాదు - ఆవిడకు మీమీద ఉన్న చనువు ప్రదర్శించటమేకాని. కాని, నేను నిర్ణయం చేయాల్సిందీ ఏమీ లేదు. తెచ్చినా మానుకున్నా మీ యిష్టం. మీకూ నాకూ సంబంధంలేదు." అని గబగబా పైకి వెళ్ళి గది తలుపులు వేసుకుంది.

విజయతో ఏకాంతం దొరికి మూడు రోజులయింది. తను మేడమీద ఉంటే విజయ క్రింద, తను క్రిందఉంటే విజయ మేడమీద.

''వాళ్ళమ్మకి ఉత్తరం రాసినట్లుంది విజయ" అంది సావిత్రి.

''ఏమని రాసిందీ" పేలవంగా నవ్వుతూ అడిగాడు ప్రసాద్.

''వంట్లో బాగుండలేదనీ, వచ్చి తీసుకెళ్ళమనీ రాసిందిట" అంది సావిత్రి.

ఆ రోజు సాయంత్రం సినిమాకి వెళ్ళి వచ్చారు. విజయ, సావిత్రి. వచ్చేటప్పటికి వొళ్ళు బాగా వేడిగా ఉంది. భోజనం చెయ్యకుండానే సావిత్రి పక్కన పడుకుని నిద్రపోయింది విజయ.

---

● హోటల్ సర్వర్‌తో ఒకడు: "ఒక పెసరట్టు. ఉల్లిపాయ ముక్కలు వెయ్యకుండా."

*సర్వరు పరధ్యానంగా లోపలికెళ్ళి తిరిగొచ్చి: ''ఉల్లిపాయ లయిపోయాయిసార్. అల్లం ముక్కలు వెయ్యకుండా తీసుకురమ్మంటారా ?''*

మరునాడంతా ఉంది జ్వరం. రాత్రి సావిత్రిని పిలుచుకుని తన గదిలోకి వెళ్ళి పడుకుంది విజయ. నిద్రపోయింది. ప్రసాద్ వచ్చి మెల్లిగా పిలిచాడు. సావిత్రికి మెలకువగానే ఉంది. బెడ్ లైట్ వెలుగుతోంది గదిలో. అతడువస్తే తలుపు తియ్యవద్దని చెప్పి పడుకుంది విజయ. కానీ అతడు విజయకి భర్త. మెల్లగా తలుపుతీసి" నిద్రపోతోంది. నువ్వువస్తే తలుపుతీయవద్దంది." అంది సన్నగా నవ్వుతూ.

ప్రసాద్ యెక్కువ చప్పుడు చెయ్యకుండా వెళ్ళి మంచం దగ్గరగా కుర్చీలో కూర్చున్నాడు.

తను గమనించలేదు ఇన్నాళ్ళూ. ఎంత చిక్కిపోయింది విజయ ! ఆ సుకుమారంగా అందంగా ఉన్న ముఖంలో ఏదో బాధ. బరువూ ఉన్నాయి. మూసుకున్న కనురెప్పలమీద దట్టమైన కనుబొమలు దిద్దినట్లు అందంగా ఉన్నాయి. పొడుగ్గా, నాజూకుగా ఉండే ఆముక్కుక్రింద సన్నగా గులాబి పెదవులూ - ఎందుకింత అందంగా కనిపిస్తోంది విజయ.

ఆ పడుకున్న తీరుకూడా కోపగించి తనను దగ్గరకు రావద్దు అంటున్నట్టే ఉంది. విజయకి ఎందుకింత కోపం? నిజంగా అంత బాధ పడుతోందా ?

ఈ జ్వరం అంతా మనోవ్యాధేనా ? విజయ బాధపడటానికి కారణం నాలో ఉందా !

''రెండు రోజులు జ్వరం. డాక్టరికి చూపించాలి" అన్నాడు ప్రసాద్.

''ఈ పిల్ల మనసులో చాలా బాధపడుతున్నట్లుందోయ్" అంది సావిత్రి.

''నా తప్పుఉందా ?'' అన్నాడు ప్రసాద్.



''తప్పు అనటానికేముంది. కొంతమంది ఎట్లాగపడితే అట్లా సర్దుకుపోతారు. కొంత మంది బాధపడుతూ మారతారు. కొంతమంది చచ్చినా మారలేరు. పల్లెటూరి వాళ్ళు సినిమా స్టార్లలాగ నిముషాలమీద వేషాలు మారుస్తుంటారు. చదువు సంస్కారంఉన్న వాళ్ళు సాధారణంగా సింపుల్‌గా, సంప్రదాయంమీద అభిమానంగా ఉంటారు. విజయ చదువుకోనిదా, ప్రపంచం తెలియనిదా ? నువ్వే కాస్త మారాలయ్యా....

మాటలకి విజయకి మెలకువ వచ్చింది.

''మీరెందుకు వచ్చారూ ?'' అంది సన్నగా.

మళ్ళీ నవ్వింది.

''మీకూ నాకూ సంబంధంలేదు. స్నేహితురాలిలాగ చూడటానికి వచ్చారా?" అంది.

''మాట్లాడక పడుకో" అని కసిరింది సావిత్రి.

''మరి నువ్వెందుకు రానిచ్చావూ. ఇతడు నా కేమీకాడు. నా గదిలోకి ఎందుకు రానిచ్చావూ. నా కెంత కోపంవస్తుందో తెలుసా. నన్ను ముట్టుకుంటాడని, ప్రేమ ఒలకబోస్తాడనీ గుర్తువస్తే గోదావరిలో దూకాలనిపిస్తోంది" అని సావిత్రిఒడిలో తలపెట్టుకుని, నవ్వుతూ, -

"భలే పిక్చర్ చూశాంలే. పడవవాడిని ప్రేమించింది. అది అభిమానం అనుకుంటే బాగానేఉంది. కానీ అది ప్రేమగా పరిణమించింది. మనసులో మూగగాఉంది. ఎట్లా ప్రేమించిందో ! ప్రేమ ఉందికను కదంపతుల్ని చెయ్యాలి. ఈ జన్మలో వాడిని పెళ్ళిచేసుకోటానికి అంతస్థు అడ్డు. అందుకని ఈ జన్మలో కలపకుండా చంపేసి, వచ్చేజన్మలో ఇద్దరినీ సమానంగా పుట్టించి పెళ్ళిచేసేశాడు. ఏం బ్రహ్మాండంగావుంది.





రాసినవాడి బ్రెయిన్ సామాన్యమయింది కాదు. ప్రేమ, దాంపత్యం, జన్మాజన్మాగతమయిన అనుబంధం ఈ మూడింటికీ ముడి ఎక్కడ !

పాపం - ఈ జన్మలో వాడిని, సాటివాణ్ణి మనసారా ప్రేమించిన పిల్లకి రెండో జన్మకూడా లేదు. దానిప్రేమ, దాని దుఃఖం అన్నీ కూడా దానితోటే పూర్తి అయ్యాయి. నేనుకూడా గౌరినే" అని ప్రసాద్‌నేపు కళ్ళుతిప్పి.

"నీ అమ్మాయిగారు ఇంకా ఈజన్మలో నీకు దొరకలేదు. పాపం వెళ్ళు. కలకత్తా రోడ్లమీద స్లీవ్‌లెస్ బ్లౌజ్ వేసుకుని, లిప్‌స్టిక్ పూసుకుని, నెత్తిమీద చుట్టయెత్తుకుని నీకోసం ఎతుకుతూ ఉంటుంది. ఎక్కడుందో ఎల్లి సూసుకో. ఎతుక్కో" అంది.

సావిత్రికి నవ్వు వచ్చేసింది. ఆపుకుంటూ

"ఏమిటా అల్లరి విజయా ?" అంది.

"అల్లరా? నీకు అల్లరిలాగ కనిపిస్తోందా? నాకు అల్లరిచెయ్యటం, ఎవరినీ ఆడించటం చాతకాదు. దయచేసి అతడిని ఇంక అవతలికి వెళ్ళమని చెప్పు. నాలుగురోజులు మాత్రమే నేనీ గదిలో ఉండేది" అంది విజయ.

ఆ మరునాడు విజయ తల్లీ, తండ్రీ వచ్చారు. తల్లి సలహాపైన సావిత్రి కబురు చెయ్యగా, లేడీడాక్టరు వచ్చింది.

''అమ్మాయికి రెండు నెలలు నిండాయి" అంది.

సావిత్రి, విజయ తల్లీ నవ్వుకున్నారు.

''ఎంత అడిగినా చెప్పింది కాదు. నేను అప్పుడే అనుకున్నా'' అంది విజయ తల్లి.

''నువ్వు తండ్రివి కాబోతున్నావయ్యా. ఏం హడావిడి చేసిందీ'' అంది పిన్నిగారు ఆశ్చర్యం, సంతోషం కలిపి ప్రసాద్‌తో.

''తల్లి కాబోతుంటే ఇంత హడావిడి చేస్తారా ?'' అన్నాడు ప్రసాద్.

తల్లీ, తండ్రి వచ్చాక చాలా ప్రశాంతంగా ఉంది విజయకి. డాక్టర్ వెళ్ళగానే మిశ్రా భార్య వచ్చింది. దగ్గరగా ఉన్న కుర్చీలో కూర్చుని.

''ఎట్లా ఉంది మీ ఆవిడకి ?'' అంది.

ఆవిడ చేతులమీద, మెడమీద చూపుల్ని సంక్రమింప జేయటానికి బదులు, స్థిరంగా ఆవిడ ముఖంలోకి చూస్తూ.

''విజయకి రెస్టుకావాలని చెప్పింది డాక్టర్. తల్లికాబోతున్నది" అని చెప్పాడు ప్రసాద్.

---

● ఇరవయ్యేళ్ళ యువకవితో పత్రికా సంపాదకుడు :

''ఈ పద్యాలు మీరు రాసినవేనా ?"

''అవునండి. అవిపూర్తిగా నేనురాసినవేనండి.''

"నమస్కారం రాయప్రోలు సుబ్బారావుగారూ ! మీకు డబ్భయ్యేళ్లు దాటాయని ఎవరో అబద్ధంచెప్పారు నాతో.''

శ్రీమతి మిత్రా కంగ్రాచ్యులేట్ చేసి ఎక్కువసేపు కూర్చోకుండానే వెళ్ళిపోయింది. విజయకి ఆశ్చర్యంగా ఉంది ప్రసాద్ ప్రవర్తన. భర్తమీద. ఆవిడమీద కూడా జాలిపుట్టుకువచ్చింది.

"ఆవిడని అట్లా పంపించేశారు ఏమీ అనుకోదూ" అంది.

"ఆవిడ అనుకోవటంకంటే. నాకు నువ్వు ఏమనుకునేదే ముఖ్యం విజయా" అన్నాడు ప్రసాద్.

విజయ అంతరాంతరాల్లో ఒక స్పందనం కలిగి సన్నని ఆనందపుకెరటం వీచింది.

"నువ్వు ఇప్పుడే వెళ్ళిపోతావా? అన్నాళ్లు ఉండగలవా?" అని అడిగాడు.

విజయ గంభీరంగా

"మీరు నావారు-నా సర్వస్వం అనుకుంటే ఈ మమకారాలు-అసూయలూ కానీ మీరు నాకేమీ కారనుకుంటే బాధ ఏముందీ; నాకు అసలు పెళ్ళేకాలేదనుకుంటాను" అంది.

"నువ్వు అనుకోగలవేమో కానీ నేనను కోలేను. ప్రేమ అంటావు ఇదేనా?"

"ప్రేమకాదు. భార్యని అభిమానించటం నేర్చుకోండి. హెన్ పెక్‌డ్ అంటారేమోనని భయపడాల్సినంత మూర్ఖురాలిని-స్వార్థపరురాలిని మాత్రం నేనుకాదు." అంది విజయ.

• • •

విజయకి కూతురు పుట్టినప్పుడే ప్రసాద్‌కి ఆంధ్రాకి ట్రాన్స్‌ఫరయింది. విజయ మళ్ళీ కలకత్తా వెళ్ళలేదు.

పిల్లకిప్పుడు రెండేళ్ళు. ఆ ఊళ్ళో ప్రసాద్‌కి మంచిపేరు, పలుకుబడిఉన్నాయి. ఇప్పుడు విజయ పేరు, పలుకుబడి వున్న వ్యక్తి అందరిలోకీ అందగత్తె, మంచి సరదాలున్న మనిషి.

కానీ ప్రసాద్ చాలా మారిపోయాడు.

"ఇవేళ నా స్నేహితురాలు విమల ఊరినుంచి వచ్చింది. భోజనానికి పిలిచాను. ఇంకో ఇద్దరు ఫ్రెండ్స్‌ని భోజనానికి పిలిచాను. మీరు కూడా ఇంట్లో ఉండండి" అంటుంది విజయ,

"మీ ఆడవాళ్ళు సరదాగా కాలక్షేపం చేసుకోండి. నేను రావాలంటే వాళ్ళందరినీ పెళ్ళిచేసుకుని శ్రీయుతులతో సహా రమ్మను. అయినా నాకు కాలక్షేపానికి ఏం తక్కువ? ఆఫీసు, సాయంత్రం క్లబ్. చల్లని ఏకాంత వేళల్లో నీవు-ఉండగా నాకింకేం కావాలి!" అంటాడు.

విజయ మనసు సంతృప్తితో నిండిపోతుంది. గర్వంతో ఆమె ముఖం యింకా అందాల్ని చేకూర్చుకుంటుంది.

ప్రసాద్ ఎందుకిట్లా మారిపోయాడు! కారణం ఏమిటి? అనుకుంటుంది

తనమూలంగా మారాడా? స్థలం మార్పు వలన మారాడా? కలకత్తా జీవితంగుర్తువస్తే

"అట్లాగ పిచ్చియెత్తిపోయిన విజయని నేనేనా?"

అని ప్రశ్నించుకుంటుంది.

అతడు ఎందుకట్లాగ ప్రవర్తించేవాడు? చిన్నతనమేమో! ఒక వ్యక్తిమీద అభిమానం కుదిరేదాకా అంతా అట్లాగే ప్రవర్తిస్తారేమో! అనుకుంటుంది. ఈ సమస్య గురించి ఆలోచిస్తూనే ఉంటుంది. సమాధానం రాదుకానీ, ఇప్పటి ప్రసాద్‌ని తలుచుకుంటేమాత్రం విజయ మనసునిండా తృప్తే. □□□





# జంట స్వరాలు

ఆమధ్యనే ఒక అమాయక చక్రవర్తి నన్నడిగిన ప్రశ్నారాజమేమంటే, "సాహిత్య సమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారికి, సంగీత సమ్రాట్ శ్రీ విశ్వనాథ రామ్మూర్తి ఏమౌతాడూ?" అని. తెలియనివారు "విశ్వనాథ రామ్మూర్తి"అన్న పేరు వినగానే విశ్వనాథ అనేది యింటి పేరనీ, రామ్మూర్తి వ్యక్తిపేరనీ అనుకోవడం నూటికి నూరుపాళ్ళూ సంభవం. సఖబు, ఈ ఒకేపేరులో ఇద్దరు విశిష్టవ్యక్తులు ఇమిడివున్నారని తెలియగానే, ఆ తెలియని వారు తెల్లపోవటంకూడా సహజం. ఇలాటి సంగీతపు జంటలు ఉత్తరాదిని "శంకర్-జైకిషన్ల"తో ప్రారంభమయ్యాయి. దక్షిణాదిని "విశ్రామ్" - విశ్వనాథం రామ్మూర్తి గారలతో ప్రారంభమయ్యాయి. కనకనే వీరిరువురినీ, రసికులు దక్షిణాది శంకర్ జైకిషన్లని అనడం పరిపాటైపోయింది. అనతికాలంలోనే శంకర్-జైకిషన్లకు "ఉత్తరాది విశ్వనాథన్ రామ్మూర్తు"లనిరసికులు పేరిడినా మనం ఆశ్చర్య పోనవసరం లేదు. అంతటి ప్రతిభావంతులీ దక్షిణభారత సంగీతపు కవలలు.

వీరి సంగీతంలో పాలపొంగులా పొంగే నవయౌవనం ఉరకలేస్తూ వుంటుంది. బాణీలలో నిత్య నూతనమైన దోరణులూ, సరళ తరళ సరసులూ ధ్వనిస్తూవుంటాయి. వాద్య ప్రయోగాలలో వీరికి వీరే సాటి. ముఖ్యంగా, గిటార్, వయొలిన్స్, అకార్డియన్, బోంగాస్ వగైరా పాశ్చాత్య వాద్యాలను అచ్చంగా అప్రాచ్యసంప్రదాయంలో. అర్వాచీన పద్ధతిలో అత్యంతాకర్షణీయంగా అమర్చగలిగే వైదగ్ధ్యం, అపూర్వాధిక్యం గల అనంతశక్తి సంపన్నులు. వీరు కుదిర్చే ఈ బ్యాక్‌గ్రౌండు బిట్సు ఎంతమజాగా వుంటాయంటే రసజ్ఞులేకాక రసాజ్ఞులు సైతం కూనరాగం తీసేటప్పుడు గూడా తరుచూ, పాటలతోపాటు ఈ పీసెస్‌కూడా అనుకోనిదే "పీస్" (శాంతి) పొందలేరు.

ఒకపాట రికార్డుచేసేలోపున వీరుపడే తాపత్రయం ఇంతా అంతాకాదు. ఒకేపల్లవిని అనేకరాగాలలో రకరకాలుగా రూపొందించి, వాటన్నిటినీ వడియగట్టి, ఒక్కచక్కనిమట్టు సెలెక్టు చేసుకుంటారు. దానికి చిలవలూ పలవలూ చేర్చి, అనుపల్లవి, అమర్చి, చరణాలనే ఆభరణాలను కూర్చి

పి. బి. శ్రీనివాస్